క్లుప్తంగా

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ద్వారా మంజూరైన పౌష్టికాహారాన్ని సర్పంచ్ అల్లు జోగినాయుడు సమక్షంలో శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే మాతాశిశు మరణాలను తగ్గించువచ్చున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రుద్రవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో తైక్వాండో శ్రీను, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో పతకాలతో జిల్లాకు తిరిగి రావాలని ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను పిలుపునిచ్చారు. ఇటీవల శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 38వ జిల్లాస్థాయి సబ్ జూనియర్ కూర్గీ, 13వ జిల్లాస్థాయి పూమ్‌సే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకి ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా కందుకూరులో జరగనున్న రాష్ట్రపోటీలకు జిల్లా క్రీడాకారులు ఇక్కడ నుంచి శనివారం పయనమై వెళ్లారు. వీరికి జిల్లా సంఘం తరుపున వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ సుధీర్‌వర్మ, కోచ్‌లు గౌతమ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతో చేతికి రక్త ప్రసరణ



శస్త్రచికిత్స అనంతరం కార్తీక్‌తో వైద్య బృందం

అరసవల్లి: నగరానికి చెందిన కార్తీక్ అనే యువకుడి చేతిమీద అద్దం పడి పెద్ద రక్తనాళం తెగిపోయింది. దీంతో రక్త ప్రసరణ నిలిచిపోవడంతో వెంటనే స్థానిక గ్లోబల్ న్యూరోకేర్ వైద్యుల బృందం శస్త్రచికిత్స చేసి కాపాడినట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ గౌతమ్ ప్రకటించారు. ఆస్పత్రికి చెందిన వైద్యులు బొడ్డేపల్లి యోగేష్, దుంగ శ్వేత, గౌనప భవానీల ఆధ్వర్యంలో సుమారు నాలుగు గంటల పాటు శనివారం జరిగిన శస్త్ర చికిత్సతో బాధితుని చేయి తిరిగి కదలికలతో రక్త ప్రసరణ సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో బాధితుని కుటుంబ సభ్యులు వైద్యులకు ధన్యవాదములు తెలియజేశారు.

పెద గనగళ్లవానిపేట బీచ్‌క్లీన్



బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెద గనగళ్లవానిపేట బీచ్‌ను బొల్లినేని మెడిస్కిల్స్ (ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ) ఆధ్వర్యంలో శనివారం క్లీన్‌డ్రైవ్ చేశారు. బీఎస్సీ పారా మెడికల్ విద్యార్థులంతా కలిసి బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. స్థానికంగా బీచ్ తీరానికి హాజరైన స్థానికులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీ పద్మజ, సంస్థ ప్రతినిధులు దువ్వాడ శశిభూషణ్, ఎంవీ స్వామి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షిదేవికి దీపారాధన



దీపారాధన చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా పాండ్రంగి వీధిలో ఉన్న కామాక్షి దేవీ పీఠంలో దీపారాధనలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శివలింగాకారంలో దీపాలను అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అనుమతులపై.. అయోమయం..!

- భవన నిర్మాణాలపై మంత్రి నారాయణ ప్రకటనలు
- వెబ్‌సైట్‌లో వాటికి చోటు దొరకని వైనం
- అనుమతులు రాక ఇబ్బందులు



శ్రీకాకుళం:

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేస్తామంటూ చేసిన ప్రకటనలకు విరుద్ధంగా పరిస్థితి నెలకొంది. రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ భవన నిర్మాణాలకు సంబంధించి విశాఖపట్నం, నెల్లూరుల్లో ప్రకటనలు చేస్తూ పేదలకు సులభతరంగా ఉండేలా మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని చెప్పారు. అయితే మంత్రి ప్రకటనలకు అనుగుణంగా వెబ్‌సైట్‌లో ఎటువంటి ఫలితాలు కనిపించడం లేదు. నెల రోజులుగా మెయింటెనెన్స్ పేరుతో వెబ్‌సైట్ నిలుపుదల చేయగా, ఈనెల 11 నుంచి వెబ్‌సైట్ మరలా అందుబాటులోకి వచ్చింది. అయినప్పటికీ అది తెరుచుకోవడం లేదని లైసెన్స్‌డ్ సర్వేయర్లు, మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు. దీనివలన పెండింగ్‌లో ఉన్న ప్లానులకు అనుమతులు రాకపోగా, కొత్త ప్లానులకు దరఖాస్తు చేసుకునేందుకు వీలులేకుండా పోయింది.

సర్వేయర్లదే బాధ్యత..?

ఇదిలా ఉంటే రాష్ట్ర మంత్రి నారాయణ ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి మున్సిపల్ శాఖ నుంచి అనుమతి అవసరం లేదని, లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్టిఫై చేస్తే సరిపోతుందని చెప్పడంతో ధనిక, మధ్య తరగతి వర్గాలు ఆనందపడ్డాయి. అయితే ఇది అమలు కాకుండా ఓ మెలిక పెట్టడంపై ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. ప్లాను అమలులో ఎటువంటి డీవియేషన్లు ఉన్నా లైసెన్స్‌డ్ సర్వేయర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని, అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని చెబుతున్నారు. దీంతో లైసెన్స్‌డ్ సర్వేయర్లు అంతా తాము ప్లానులు గీయమని బహిరంగంగా చెబుతున్నారు. భవన యజమాని ఇంటి నిర్మాణం విషయంలో తమ మాట ఎందుకు వింటారని ప్రశ్నిస్తున్నారు. దాదాపుగా ఎక్కువ శాతం భవన నిర్మాణాల్లో డీవియేషన్లు ఉండటం సహజం. దీనిని పర్యవేక్షించాల్సిన మున్సిపాలిటీల్లోని ప్రణాళిక విభాగం సిబ్బందిని వదిలి లైసెన్స్‌డ్ సర్వేయర్లను బాధ్యులను చేస్తామనడం విడ్డూరం.

లభించని మోక్షం

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో తొలిసారిగా అమలవుతుందనుకున్న సర్క్యులేషన్ ప్యాట్రన్‌కు ఇప్పట్లో మోక్షం లభించేలా కనిపించడం లేదు. గతంలో మున్సిపల్, జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉండిపోయిన ఈ అంశం, ఇటీవల ఆమోదం పొందినప్పటికీ దీనిని వెబ్‌సైట్‌లో పొందుపరచవద్దని రాష్ట్రస్థాయి నుంచి సమాచారాలు అందినట్టు భోగట్టా. రాష్ట్రస్థాయిలో దీనిని అమలుచేసేలా చర్యలు తీసుకుంటామని, ఆ తర్వాత వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని చెప్పడంతో ఇది ఇప్పట్లో అమలయ్యేలా కనిపించడం లేదు. మంత్రి ప్రకటనల్లో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేస్తున్నట్లు చెప్పనప్పటికీ, అందుకు భిన్నంగా చర్యలు ఉంటున్నాయని పలువురు వాపోతున్నారు.

వివరాలు తెలియాల్సి ఉంది



భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి పూర్తి సమాచారం రాష్ట్రస్థాయి నుంచి అందాల్సి ఉంది. ప్రస్తుతానికి ఈనెల 11న వెబ్‌సైట్ తెరుచుకున్నప్పటికీ కొన్ని ఇబ్బందులు నెలకొన్నట్లు లైసెన్స్‌డ్ సర్వేయర్లు ద్వారా తెలుస్తోంది. సర్క్యులేషన్ ప్యాట్రన్ అమలుకు ఇబ్బందులున్నట్టు నా దృష్టికి రాలేదు.

– ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

గూడేంలో ఇసుక నిల్వలు



శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని గూడేం పరిసర ప్రాంతాల్లో ఇసుక నిల్వలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. నిర్మాణపు భవనం వద్ద పోగులు కొద్ది ఇసుకను డంపింగ్ చేయడం, రాత్రుళ్లు అయితే వాటిని పెద్ద పెద్ద లారీల్లో విశాఖపట్నం, అనకాపల్లి తరలించడం జరుగుతోంది. స్థానిక టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఇంత రవాణా జరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– శ్రీకాకుళం రూరల్

పగలే వెలుగులు



లావేరు మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగులు చిమ్ముతున్నాయి. ఇక్కడ వీధిలైట్లు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా తాళ్ల వలస, లావేరు గ్రామాల్లో శనివారం మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్న విద్యుత్ దీపాలు దర్శనమిచ్చాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– ఎచ్చెర్ల

తాగునీటి సమస్య



ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ గ్రామ పంచాయతీ వెంకన్నగారిపేటలో తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. గత కొన్ని రోజులుగా గ్రామంలోని మంచినీటి పథకం పనిచేయడం లేదు. నాగావళి నదీతీరంలో ఏర్పాటు చేసిన బోరు బావి నుంచి నీటి ట్యాంకుకు నీరు అందించి కుళాయిలు ద్వారా నీరు అందిస్తున్నారు. ప్రస్తుతం బోరు బావి నుంచి నీరు అందడం లేదు. బారు బావిలో జలాలు సరిపడా లేకపోవడం సమస్యగా చెబుతున్నారు. దీంతో మరో బోరు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న బోరు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఉత్సాహంగా క్రీడల పోటీలు



ఎచ్చెర్ల, పాతపట్నం జట్ల మధ్య కబడ్డీ పోటీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఉత్సాహంగా బాలికలు సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల జోన్ వన్ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం రాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి. అదివారం ఉదయం ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు నుంచి 21 పాఠశాలలకు చెందిన 800 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అథ్లెటిక్స్ 100 మీటర్ల జూనియర్ విభాగంలో మొదటి మూడు స్థానాల్లో జ్యోత్స్న (వియ్యంపేట), జీవన ప్రియ (భామిని), వెంకటలక్ష్మి (కోశాం) నిలిచారు. సీనియర్స్‌లో శృతి (నర్సీపట్నం), లక్ష్మీ (గురుగుబెల్లి), శ్రావ్య (వియ్యపేట) మొదటి మూడు స్థానాలు సాధించారు. డిస్కస్ త్రో జూనియర్స్‌లో దీక్షిత (నెల్లిమర్ల), ధనలక్ష్మి (వియ్యంపేట), కృష్ణవేణి (వేపాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో చివరి దశకు చేరుకున్నాయి. జిల్లా అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.బాలాజీ నాయక్, ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ క్రీడల నిర్వహణ, వసతులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెరగాలి



శిక్షణ ఇస్తున్న రిసోర్సు పర్సన్ గోవిందరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు విస్తీర్ణం పెరగాలని రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్సు పర్సన్ గోవిందరెడ్డి అన్నారు. ప్రకృతి వ్యవసాయ శిక్షకులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 68 యూనిట్లతో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల రహిత వ్యవసాయమే లక్ష్యమని పేర్కొన్నారు. కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు గురించి ప్రచారం చేయాలన్నారు. సేంద్రీయ ఎరువులు వల్ల మెరుగైన పంటల ఉత్పత్తులతో పాటు, ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సేంద్రీయ సాగుకు రైతులు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రేవతి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయ పాల్గొన్నారు.

పరామర్శలు



రణస్థలం: తవిటినాయుడుని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని వెంకటరావుపేట గ్రామానికి చెందిన పతివాడ తవిటినాయుడు తల్లి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం పరామర్శించారు. అలాగే అదే గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొత్త కోట్ల పైడి నాయుడు తల్లీ ఇటీవల మృతి చెందారు. కొవ్వాడ గ్రామంలోని మైలపల్లి బొమ్మాయి కుమారుడు మైలపల్లి రాముడు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. మైలపల్లి గురువులు సోదరుడు మైలపల్లి రామన్న ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను సైతం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు అల్లిపల్లి అప్పన్న, మాజీ సర్పంచ్ జగ్గులు, నాయకులు కొత్తకోట్ల పరిసినాయుడు, లక్ష్మునాయుడు, గురాన చిరంజీవి, అప్పన్న, రాజయ్య తదితరులు ఉన్నారు.

జి.సిగడాం: జి.సిగడాం ఎంపీపీ మీసాల వెంకటరమణ తల్లి అదిలక్ష్మి ఇటీవల మృతి చెందింది. సమాచారం తెలియడంతో మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, ఎంపీపీ కిల్లి నాగేశ్వరరావు లు శనివారం ఆయనను పరామర్శించారు. వారితో పాటు సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, తొత్తడి రామారావు, పున్నాన అక్కనాయుడు, భూపతి సురేష్‌కుమార్, బొల్లా జనార్ధనరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయ గణపతి ఆలయం 20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్‌శర్మల ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు జరిగాయి.

చట్టాలపై అవగాహన అవసరం



వీసీలో పాల్గొన్న పీపీలు, లైజనింగ్ పోలీసు అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూలై నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసెక్యూషన్స్ రామకోటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్స్ రాజేంద్రప్రసాద్, విజయమ్మలు సూచించారు. ఈ మేరకు విజయవాడ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంపూర్ణంగా కొత్త చట్టాలపై అవగాహన పెంచుకొని, న్యాయ వ్యవస్థకు, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పబ్లిక్ ప్రాసెక్యూటర్స్, కోర్టుల పోలీస్ లైజన్ ఆఫీసర్స్ అనుసంధాన కర్తలుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలోని కలెక్టరేట్ వీసీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ప్రాసెక్యూటర్, జాయింట్ డైరెక్టర్ కాఫ్ ప్రాసెక్యూషన్స్ రఘురామ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాన కృష్ణచంద్, చింతాడ సత్యనారాయణ, లోలుగు నాగభూషణరావు, పి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



శ్రీకాకుళం అర్బన్: బలగలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులకు శనివారం నివాళులర్పించారు. వారి ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కుమార్‌రాజా తదితరులు



జి.సిగడాం శాఖా గ్రంథాలయంలో...



గార శాఖా గ్రంథాలయంలో...



ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో...

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ



శిక్షణ పొందినవారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని డీఎస్పీ వివేకానంద అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై మూడురోజుల శిక్షణ ముగింపు, ప్రపంచ రోడ్డు ప్రమాద బాధితుల జ్ఞాపిక దినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై నిర్లక్ష్యంగా ప్రయాణం చేస్తే అప్రమత్తంగా వెళ్లేవారికి సైతం ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం ఉండాలని కోరారు. ట్రాఫిక్ సీఐ నాగరాజు మాట్లాడుతూ లైసెన్సు లేకుండా వాహనాలు నడపకూడదని, తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. టూటౌన్ సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ప్రమాదాల్లో యువత ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరారు. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రథమ చికిత్స శిక్షణ పొందిన 30 మందికి ధ్రువపత్రాలను ముఖ్య అతిథుల చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ప్రోగ్రామ్ మేనేజర్ జి.రమణ, డాక్టర్ నిక్కు అప్పన్న, బి.చిన్నయరావు, కల్యాణ చక్రవర్తి, నర్సింగరావు, గుణాకరరావు, కె.వేణుగోపాల్, పి.చైతన్యకుమార్, నంది ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు చిన్నచూపు తగదు



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శానిటరీ మేస్త్రీలపై అధికారులకు సైతం చిన్నచూపు తగదని ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా 4వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టి 4 రోజులు అవుతున్నా అధికారులు కళ్లు మూసుకొని ఉండడం అన్యాయమన్నారు. మేస్త్రీలను విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, రామచంద్ర, డి.రమణ, అర్జీ గణేష్, రసూల్, గౌతంరాజు, సోగ్గాడు, సీతమ్మ, పొట్నూరు రాజులమ్మ,అర్జీ లక్ష్మీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలస గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి శనివారం భూమిపూజ నిర్వహించారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. గ్రామాల ప్రగతికి మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ చెప్పారు. సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.